www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 11 | జూన్ | 2026
పేజీలు : 8

## కామాగ్నికి బలై జీవచ్ఛవంలా మారిన బాలిక

**-భవిష్యత్తు ఇబ్బందికరమే అంటున్న వైద్యులు**
**-ఈ ఘటనలోనూ జోక్యం చేసుకున్న సెటిల్‌మెంట్ బ్యాచ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సరిగ్గా నాలుగు రోజుల క్రితం ఓ కామాంధుడి కామాగ్నికి బలైన బాలిక జీవచ్ఛవంలా మారింది. తల మినహాయిస్తే మిగిలిన శరీర భాగాలు పని చేయడం లేదు. భవిష్యత్తులో కూడా పని చేస్తాయన్న భరోసా ఇవ్వలేమని వైద్యులు తేల్చి చెబుతున్నారు. ఈనెల ఆరున 12 ఏళ్ల బాలికను భవనంపైకి తీసుకెళ్లి లైంగిక దాడి తర్వాత కిందకు తోసేసిన ఘటన విధితమే. మూడు రోజుల తర్వాత స్పృహలోకి వచ్చిన బాలిక నోరు విప్పడంతో అసలు విషయం బయటకు వచ్చింది. అయితే ఈ ఘటనకు సంబంధించి నిర్ఘాంతపోయే విషయాలు క్రమక్రమంగా వెలుగులోకి వస్తున్నాయి. కొందరు రాజకీయ నాయకులు దీనిని కూడా మభ్యపెట్టి మసిబూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేశారు. బయట మాట్లాడుకుంటే మాకు అభ్యంతరం లేదన్న కొందరు అధికారుల సలహా సైతం సెటిల్‌మెంట్ గ్యాంగ్‌ను ప్రేరేపించింది. బాలిక కుటుంబానికి ఇంత, మాకెంత అనే ధోరణిలో సెటిల్‌మెంట్ గ్యాంగ్ రంగంలోకి దిగింది. సామాజిక కార్యకర్తలు, కొందరు రాజకీయ నేతలు బాధితురాలి పక్షాన గట్టిగ నిలబడటం, విషయం వెలుగు చూడగానే మహిళా సంఘాలు స్పందించడంతో ఈ సెటిల్‌మెంట్ వ్యవహారానికి తెర పడింది. నిర్ధయగా వ్యవహరించిన వ్యక్తిని కాపాడటానికి కొందరు రాజకీయ నాయకులు ప్రయత్నించడం ఇప్పుడు నగరంలో చర్చనీయాంశంగా మారింది. ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ

మిగతా 2లో..

# కదంతొక్కిన సిపిఐ శ్రేణులు

## కలెక్టరేట్ల ముట్టడి.. ఉద్రిక్తత

## ఆర్థిక పతనం దిశగా దేశం : కూనంనేని











ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సిపిఐ శ్రేణులు కదం తొక్కాయి. పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టిన కలెక్టరేట్ల ముట్టడి ఉద్రిక్తంగా మారింది. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ల వద్ద ముట్టడి సందర్భంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సిపిఐ కార్యకర్తలు కలెక్టరేట్ గేట్లను తోసుకుని లోపలికి వేళ్లే ప్రయత్నం చేయడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అటు కొత్తగూడెంలోనూ ఇటు ఖమ్మంలోనూ పోలీసులకు, సిపిఐ కార్యకర్తలకు నడుమ తోపులాట జరిగింది. ధరలు తగ్గేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సిపిఐ నాయకులు తెలిపారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ, రైతు భరోసా అమలు చేయాలని, మహిళలకు నెలకు రూ. 2,500 ఖాతాల్లో జమ చేయాలని, పింఛన్లను పెంపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరు కాగా ఖమ్మంజిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా ఆందోళనకు నేతృత్వం వహించారు.

2లో..





## విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలు..!




**- కనీస నిబంధనలు గాలికి**
**- అధిక ఫీజుల దోపిడీ**
**- అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన**
**- బహుళ అంతస్తుల్లో తరగతి గదులు**
**- పిల్లల శరీర, మానసిక స్థితిపై ఆందోళన**
**- టీచర్ల పిల్లలు కూడా ప్రైవేటు బడులకే..**
**- మరి ప్రైవేటు విద్య బలోపేతమయ్యేది ఎన్నడో ?**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలు రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి అర్హత లేని ఉపాధ్యాయులచే విద్యాబోధన సాగిస్తున్నారు.ఇదిలా ఉండగ ఫీజుల మోత మామూలుగా లేదు. నోటు పుస్తకాల మొదలు బూట్లు, సాక్సులు, పెన్నులు, పెన్సిళ్లు, యూనిఫామ్‌లు కూడా విక్రయిస్తూ విచ్చలవిడిగా దండుకునేందుకు ఈ ఏడాది కూడా రంగం సిద్ధమవుతోంది. నాణ్యమైన విద్యను అందిస్తామని సాకుతో ప్రైవేటు పాఠశాలలు నెలకొల్పుతూ అందినకాడికి దోచుకుంటున్నారు.

మిగతా 2లో..

## వాహనదారుల ప్రాణాలతో గుత్తేదారు చెలగాటం..!







**-నిర్మాణంలో మున్నేరు తీగల వంతెన**
**-పట్టించుకోని అధికారులు**
**-అవస్థలు పడుతున్న ప్రయాణికులు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం సమీపంలోని మున్నేరు పై రూ. 180 కోట్లతో తీగల వంతెన నిర్మిస్తున్నారు. వంతెన నిర్మాణ పనులు వేగంగానే సాగుతున్నా గుత్తేదారు నిర్లక్ష్యం మాత్రం

మిగతా 2లో..

# కదంతొక్కిన సిపిఐ శ్రేణులు






ప్రజాపక్షం/ఖమ్మం : భారతదేశం మోడీ పాలనలో ఆర్థిక పతనం దిశగా పయనిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. మోడీ విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నా భిన్నం చేశాయని భవిష్యత్తులో మరిన్ని ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ధరల పెరుగుదలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. వందలాది మంది సిపిఐ కార్యకర్తలు ధరల తగ్గింపు నిరసన ఆందోళనలో పాల్గొన్నారు. వి. వెంకటాయపాలెం స్టేజీ వద్ద నుంచి కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయేందుకు సిపిఐ శ్రేణులు ప్రయత్నించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు, పార్టీ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఆందోళనకారులను ఉద్దేశించి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ దేశంలో ప్రజల కోసం కాకుండా కార్పొరేట్ల కోసం పాలన సాగుతుందని మోడీది కార్పొరేట్ల పాలన అని ఆయన స్పష్టం చేశారు. సహజంగా సంపన్నులు, వ్యాపారులపై పన్నులు విధించి పేదలను ఆదుకునే ప్రయత్నం ప్రభుత్వాలు చేస్తాయని కానీ మోడీ ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా పేదలపై భారాలు మోపుతూ సంపన్నులు, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ప్రకటిస్తున్నారని కూనంనేని తెలిపారు. ప్రజలపై ధరాభారం మోపుతున్న ఈ మోడీకి వ్యతిరేకంగా యావత్ ప్రజానీకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మన్మోహన్ సింగ్ హయాంలో డాలర్ ధర రూ. 56 ఉంటే అప్పుడు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోడీ రూపాయి పతనంపై ఆరోపణలు చేస్తూ రాజీనామాకు డిమాండ్ చేశారని మరి ఇప్పుడు చరిత్రలో ఎన్నడులేనివిధంగా ఒక డాలర్‌కు రూ.96.50లు చెల్లించే పరిస్థితి దాపురించిందని దీనికి మోడీ ఏమి సమాధానం చెబుతారని కూనంనేని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ ధరలు రెట్టింపుకు పైగా పెరిగాయని, గ్యాస్ బండ ఈ ఏడాదిలోనే మూడు సార్లు పెరిగిందని ఆయన తెలిపారు. ధరలను నియంత్రించ లేని మోడీ పరిపాలనకు అనర్హుడని కూనంనేని తెలిపారు. మోడీ ఇచ్చిన ఏ వాగ్దానాన్ని 12 ఏళ్ల కాలంలో అమలు చేయలేదని నల్ల ధనం తీసుకు రాలేదని, కోట్ల ఉద్యోగాలను కల్పించ లేదని ఆయన తెలిపారు. ప్రజా వ్యతిరేక చట్టాలను తీసుకు రావడంలో మాత్రం మోడీ ముందు వరుసలో నిలిచారని కూనంనేని ఆరోపించారు. దేశంలో సంపద పోగుపడుతుందని దేశ ప్రజలు పేదలు, సంపన్నులు అనే రెండు వర్గాలుగా విడిపోయారని తెలిపారు. ఎరువుల ధరలు పైపైకి పోతున్నాయి. రాష్ట్రంలో కూడా పెట్రో ధరలను నియంత్రించే అవకాశం ఉన్న అదే ఆదాయ వనరుగా భావించి ధరలను నియంత్రించ లేదని కూనంనేని తెలిపారు. ఇద్దరు పాలనపై పట్టు కోల్పోయారు. రెండున్నర ఏళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదు. పింఛన్ల పెంపు, పూర్తి స్థాయిలో రైతు భరోసా జరగ లేదని రైతు భరోసా విషయంలో రకరకాల కారణాలతో ఎగవేతలు జరుగుతున్నాయని కూనంనేని తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించిందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం రెండున్నర ఏళ్ల పాటు వేచి చూశామని ప్రభుత్వం సరైన రీతిలో స్పందించక పోవడంతో ఆందోళన బాట పట్టామని కూనంనేని తెలిపారు. ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయమై విద్యార్థుల పక్షాన, ఉద్యోగ, ఉపాధి కల్పన కై యువజనుల పక్షాన, ఎరువుల ధరలు తగ్గించాలని, పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేయాలని, పంట బీమా పథకాన్ని అమల్లోకి తీసుకు రావాలని కూనంనేని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నాం ఏమి చేసినా సరిపోతుందని ప్రజలను విస్మరిస్తే తగు ప్రతిఫలం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు.

**హామీలు నెరవేరే వరకు నిరంతర ఆందోళనలు :**

హామీలు నెరవేరే వరకు నిరంతర ఆందోళనలు తప్పవని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. హామీల అమలు కోసం రెండున్నర ఏళ్ల పాటు ఎదురు చూశామని రాష్ట్ర ప్రభుత్వం ఆ హామీల అమలుపై దృష్టి సారించడం లేదన్నారు. రాష్ట్రంలోని అప్పులను ఎరగా చూపుతూ పథకాల అమలును వాయిదా వేస్తుందని ఆయన తెలిపారు. పెట్రో ధరల పెంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్యాస్ బండపై మూడు సార్లు ధరలు పెంచారని పెట్రోల్, డీజిల్ ధర నిరంతరం పెరుగుతూనే ఉందని ఆయన తెలిపారు. ధరల పెరుగుదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. మోడీ కార్పొరేట్ల గుప్పెట్లో బంధీగా మారి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. ధరల పెరుగుదలను నియంత్రించక పోతే సమరశీల పోరాటాలకు శ్రీకారం చుడతామని సురేష్ హెచ్చరించారు. ఈ ఆందోళనను ఉద్దేశించి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు మాట్లాడగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, సిద్ధినేని కర్ణకుమార్, బిజి క్లైమెంట్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, కర్నాటి భానుప్రసాద్, తాటి వెంకటేశ్వరరావు, ఏపూరి రవీంద్ర బాబు, పుచ్చకాయల కమలాకర్, దొండపాటి రమేష్, తోట రామాంజనేయులు, మిడికంటి చిన్న వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, దండు ఆదినారాయణ, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్, కూచిపూడి రవి, యంగల ఆనందరావు, యానాలి సాంబశివరెడ్డి, ప్రజా సంఘాల బాధ్యులు బత్తినేని నీరజ, నానబాల రామకృష్ణ, మడుపల్లి లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ, రఘునాథపాలెం మండల కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఆందోళన అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టిపిస్‌కు అందజేశారు.

**భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో..**



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ కేంద్ర ప్రభుత్వం పేదవాడి పొట్ట కొడుతోందని, ప్రజాపక్షాన ఉద్యమాలు మరింతగా పెంచి అధికార దాహంతో మూసుకుపోయిన పాలకుల కళ్లు తెరిపిస్తామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. పెంచిన ఇంధన ధరలు తగ్గించాలని, నిత్యావసరాల ధరలను పేదలకు అందుబాటులోనికి తేవాలని, డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ,కేంద్రంలోని ఎన్‌డిఏ ప్రభుత్వం సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపడం దుర్మార్గమన్నారు. పెంచిన ఇంధన,గ్యాస్ ధరలకు సామాన్యుల నడ్డి విరుస్తున్నారని, ధన వంతులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను దోచుకుంటున్నారని మండిపడ్డారు. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే పాలకులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రానికి రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. పేద, మధ్య తరగతి ప్రజలు ప్రయోజనాలను పణంగా పెడుతున్న పాలకుల తీరుపై రాజీలేని పోరాటాలు చేస్తామని, తక్షణమే పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని, లేదంటే ప్రతిఘటన ఉద్యమాలు తప్పవని కూనంనేని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కే సారయ్య, మున్నా లక్ష్మీ కుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి పూర్ణ చంద్రరావు, జి వీరస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, భూక్యా ధస్రు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కె ఫహీమ్, మండల కార్యదర్శులు,జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

---

# విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాలలు..!

(మొదటిపేజీ తరువాయి) వ్యాపార దృక్పధమే తప్ప మరొకటి కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదు. ఈ నెల 15 నుండి నూతన విద్యా సం. ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రచారం హోరు జోరందుకుంది. విద్య లాభసాటి వ్యాపారంగా మారడంతో వివిధ రంగాలకు చెందిన వ్యాపారులు కూడా ఇటువైపు మొగ్గు చూపుతున్నారు.

**అర్హత లేని ఉపాధ్యాయులచే బోధన :** ఇక ప్రైవేటు బడుల్లో విద్యాబోధన చేసేది చాలా వరకు అర్హతలేని వారే. ఇంటర్, డిగ్రీలు చదివిన వారికే తక్కువ జీతాలు ఇచ్చి బట్టీపట్టే చదువులు చెప్పిస్తున్నట్లు ప్రచారం ఉంది. ప్రైవేటు పాఠశాలల వారు అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ అరకొర జీతాలతోనే సరిపెడుతున్నారు. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే లక్షల్లో జీతాలు తీసుకునే ఉపాధ్యాయులు కూడా వారి పిల్లలకు అర్హతలేని అరకొర జీతాలు తీసుకునే ఉపాధ్యాయులతోనే చదువులు చెప్పించడం గమనార్హం.

**బహుళ అంతస్తుల్లో తరగతులు :** ప్రైవేటు పాఠశాలలు చాలా వరకు బహుళ అంతస్తుల్లోనే కొనసాగుతున్నాయి. ఆ గదులు చాలా వరకు ఇరుకుగానే ఉంటున్నాయి. ఒక్కొక్క తరగతిలో 40 మంది విద్యార్థులను కుక్కి కుక్కి కూర్చోబెడుతున్నారు. గాలి,వెలుతురు అంతంత మాత్రమే. అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే నివారణ చర్యలకు కూడా చాలా సమయం పట్టేంతగా వాతావరణం ఉంటుంది. దీంతో ప్రమాదాలు సంభవిస్తే పరిస్థితి ఏంటనేది ఆందోళన కలిగించే విషయం.

**పిల్లలపై ప్రభావం :** బహుళ అంతస్తుల్లో పుస్తకాలతో కుస్తీలు పట్టే విద్యార్థులకు సరైన ఆట, పాటలు లేకపోవడంతో వారి మానసిక, శారీరక స్థితిపై ప్రభావం పడుతుందని నిపుణులు మొత్తుకుంటున్నారు. చాలా ప్రైవేటు పాఠశాలలకు సరైన ఆట స్థలాలే లేవు. దీంతో ప్రైవేటు బడుల పిల్లలు ఆటపాటలకు ఆమడ దూరంలో ఉంటున్నారు. దీంతో వారు పుస్తకాలకే పరిమితం అవుతున్నారు తప్ప మానసిక ఎదుగుదలతో కూడిన చదువులు అందడం లేదు.

**టీచర్ల పిల్లలకు కూడా ప్రైవేటు బడులకే :** నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు అనే సామెత ఇక్కడ అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. ఎంఏ బిఇడి, డిఇడి వంటివి ఉపాధ్యాయ విద్యను అభ్యసించి , వేలాది మందితో పోటీ పడి పరీక్షల్లో ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సంపాదించి నేడు లక్షల్లో జీతాలు తీసుకుంటున్న వారి పిల్లలు కూడా ప్రైవేటు బడుల్లోనే చదువుతున్నారు. ప్రజల సొమ్ముతో చెల్లించిన పన్నులతో జీతాలు తీసుకునే ఉపాధ్యాయులు ఆ సొమ్మును ప్రైవేటు బడుల్లో వెచ్చిస్తున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం పెరిగేలా ప్రచారం చేస్తున్న చాలా మంది ఉపాధ్యాయుల పిల్లలు ప్రభుత్వబడుల్లో చదవడం లేదు. దీంతో చాలా మంది ప్రజలు వారి పిల్లలకు ఒక న్యాయం, మా పిల్లలకు ఒక న్యాయమా...మా పిల్లలను ప్రైవేటు బడులకే పంపుతామంటున్నారు.

**బలోపేతం అయ్యేది ఎలా ? :** ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు తొలి అడుగు వేయాల్సి ఉపాధ్యాయులే ప్రైవేటు బడులపై మక్కువ చూపుతుంటే ప్రభుత్వ విద్య ఎలా బలోపేతం అవుతుందంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులతో పాటు పలు శాఖల్లో అధికారులు, ఉద్యోగుల పిల్లలు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన నాడే ఇతర ప్రజలకు ప్రభుత్వ బడులపై నమ్మకం పెరిగే అవకాశం ఉందని విద్యావేత్తలు అంటున్నారు. ఇందుకోసం ప్రభుత్వాలు నూతన నిబంధనలు తీసుకొస్తేనే తప్ప మార్పు రాదంటూ చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఈ దిశగా అడుగులేసి ప్రభుత్వ విద్యాబలోపేతాని కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

**అందుబాటులోనికి రాలేదు :** ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీ, విద్యా ప్రమాణాలు, నిబంధనలు, అర్హతలేని ఉపాధ్యాయులు, ఆట స్థలాలు, ప్రైవేటు బడుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగుల పిల్లలు తదితర అంశాలపై వివరణ కోరేందుకు జిల్లా విద్యాధికారి వాసంతిని ప్రజాపక్షం వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె సెలవుపై వెళ్లినట్లు తెలిసింది. అదనపు బాధ్యతల్లో ఉన్న శంభుప్రసాద్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోనికి రాలేదు.

## వాహనదారుల ప్రాణాలతో గుత్తేదారు చెలగాటం..!

(మొదటిపేజీ తరువాయి) వాహనదారులకు ప్రాణ సంకటంగా మారింది. వంతెన నిర్మాణంలో ఉన్నప్పుడు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణం చేయడం తప్పనిసరి. కానీ మున్నేరు బ్రిడ్జి నిర్మిస్తున్న గుత్తేదారు మాత్రం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి రోజు కొన్ని వేల వాహనాలు ఈ మార్గం ద్వారా ప్రయాణిస్తుంటాయి. గతంలో నిర్మాణంలో ఉన్న తీగల బ్రిడ్జి పక్కన తాత్కాలికంగా ఓ రోడ్డు నిర్మించారు. అది అస్తవ్యస్తంగా గుంటలు పడి ఉంది. అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరుగుతున్న సమయంలో నాయుడుపేట వైపు హనుమాన్ గుడి సమీపంలో రహదారిని పూర్తిగా మూసివేసి ఎడమ వైపు నుంచి ట్రాఫిక్‌ను మళ్లించారు. దాదాపు కిలో మీటర్ మేర మోకాలు లోతు గుంటలతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నాయుడుపేట సమీపంలో ఒక పెద్ద గుంట ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది. రెండు మాసాలుగా ఇదే తంతు కొనసాగుతున్నా కనీసం స్పందించడం లేదు. ద్విచక్ర వాహనదారులు ఈ మార్గం ద్వారా ప్రయాణించడంతో తరచూ గుంటల్లో వాహనాలు పడి నడుముల నొప్పి వస్తుందని ఎందరో వాపోతున్నారు. బైపాస్ రోడ్డు ద్వారా ఖమ్మంలోకి రావడానికి చుట్టూ తిరిగి రావడం ఒక సమస్య అయితే నాయుడుపేట జంక్షన్ నుంచి మున్నేరు వరకు బైపాస్ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీనితో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. మున్నేరు బ్రిడ్జిపై ట్రాఫిక్ నియంత్రణ తర్వాత బైపాస్ రోడ్డులో ప్రతి గంటకు ఒకసారి ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఆ మూడు కిలో మీటర్ల దూరానికి 20 నిమిషాల నుంచి అరగంట పడుతుందంటే ఆశ్చర్యం కలుగక మానదు. సహజంగా వంతెన నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూపడం అధికారులు, గుత్తేదారుల పని కనీసం ఉన్న మట్టి రోడ్డునైనా చదునుగా చేయకపోవడం బొక్కలగడ్డ, మంచికంటి నగర్ నుంచి వచ్చే మురుగు నీరు ఈ రోడ్డుపై ప్రవహించడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికార యంత్రాంగం వాహనదారుల ఇబ్బందులను చూస్తుంది తప్ప కనీసం ప్రస్తుతం ఉన్న మార్గాన్ని కనీస మరమ్మతులు చేయించాలన్న ఆలోచన కూడా చేయడం లేదు. దీనికి తోడు వాహనాల రద్దీ పెరగడంతో విపరీతంగా దుమ్ము లేస్తుంది. రోజులో ఒకసారి వారి ఇష్టం వచ్చిన సమయంలో అడ్డ దిడ్డంగా నీటిని చల్లిస్తున్నారు. అది కూడా ఇబ్బందికరంగా మారి ప్రమాదాలకు దారి తీస్తుంది. నిత్యం వేల వాహనాలు నడిచే దీనికి సంబంధించి ప్రత్యామ్నాయ మార్గానికి మరమ్మతులు చేపట్టి వాహనదారులు ఇబ్బందులు లేకుండా వెళ్లేవిధంగా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## కామాగ్నికి బలై జీవచ్ఛవంలా మారిన బాలిక

(మొదటిపేజీ తరువాయి) సెటిల్‌మెంట్లే వృత్తిగా బతుకుతున్న వారి పట్ల అధికారులు ముఖ్యంగా పోలీసులు తగు రీతిలో స్పందించాల్సి ఉంది. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు యావత్ సమాజం దీనిని ఖండించి బాధితురాలికి బాసటగా నిలవాల్సి ఉంది. కామాగ్నికి బలైన బాలిక ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని శరీరంలో అంతర్లీనంగా రక్తస్రావం జరుగుతుందని వైద్యులు నిర్ధారించారు. అంతర్గతంగా జరిగే రక్తస్రావం ఆగితే తప్ప బాలిక ఆరోగ్య పరిస్థితి కుదుటపడే అవకాశం లేదని తెలుస్తుంది. మొత్తంగా ఓ నిండు జీవితాన్ని విషాదంగా మార్చిన కామాంధున్ని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలి

**-ఎస్ఐఆర్ కార్యక్రమానికి సహకరించాలి**
**-ఎస్ఐఆర్‌పై సమీక్షలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** అర్హులైన ప్రతి ఓటరు డ్రాఫ్ట్ జాబితాలో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ ప్రత్యేక సమగ్ర ఓటర్ జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 12 లక్షల మంది ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 10 లక్షల వరకు ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందన్నారు. వివిధ కారణాల వల్ల మిగిలిన 20 శాతం ఓటర్ల మ్యాపింగ్ జరగలేదని తెలిపారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు అత్యంత బాధ్యతగా తీసుకోవాలని బిఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్లు సకాలంలో స్పందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఒక్క అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదన్నదనే లక్ష్యమన్నారు.మ్యాపింగ్ పూర్తయిన ప్రతి ఓటరు కూడా తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలని ఫారం సమర్పించని పక్షంలో వారి పేరు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో ఉండదని స్పష్టం చేశారు. ప్రస్తుతం జిల్లాలో అనామలీలను గణనీయంగా తగ్గించగలిగామని గతంలో 30 శాతం ఉన్న అనామలీలను ప్రస్తుతం 20 శాతానికి తగ్గించామని తెలిపారు. తండ్రి, కొడుకు సంబంధంగా మ్యాపింగ్ చేసిన ఇద్దరి మధ్య వయస్సు వ్యత్యాసం 15 సంవత్సరాల కంటే తక్కువగా ఉన్న తాత, మనవడు సంబంధంగా నమోదు చేసి వారి మధ్య తక్కువ వ్యత్యాసం ఉన్న వాటిని అనామలీలుగా పరిగణించి నోటీసులు జారీ అవుతాయన్నారు. జూలై 15 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఈ కార్యక్రమానికి సహకరించాలని , ప్రతి రాజకీయ పార్టీ బూత్ స్థాయిలో బిఎల్‌వోలను నియమించి పర్యవేక్షించాలన్నారు. జూలై 31న డ్రాఫ్ట్ ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. ప్రతి ఓటరు తమ పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు స్వీకరిస్తామని, సెప్టెంబర్ 28 నాటికి అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించి అక్టోబర్ ఒకటిన తుది ఎస్ఐఆర్ ఓటరు జాబితాను విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఆర్డీవో శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు పరిశీలించిన సుడా ఛైర్మన్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో సుడా నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులను సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఖమ్మం నగరంలోని రెండవ డివిజన్ పాండురంగాపురం, మూడవ డివిజన్ బల్లేపల్లి,16వ డివిజన్ లోటస్ హీల్స్ ప్రాంతాల్లో సుడా నిధులతో జరుగుతున్న రోడ్లు, డ్రైనేజీ పనులను సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు కోట్ల రూపాయలతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నిర్మాణ పనులు నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కార్పోరేషన్ అధికారులు, నాయకులు, మాజీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఒకటో వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**చిన్న వయసులో ప్రజాసేవకు కృషి చేస్తున్న కౌన్సిలర్ శ్రీకాంత్**
**గ్రామసభలో వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో బుధశారం గ్రామసభ జరిగింది. ఈ గ్రామసభలో ముఖ్య అతిధిగా వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల వినతులను స్వీకరించి సమస్యలు పరిశీలించే విధంగా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ ఒకటో వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం. అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతన్యానం. అతి చన్ని వయసులో ఈ వార్డు ప్రజలు మోర్ శ్రీకాంత్‌ను గెలిపించుకొని అభివృద్ధికి నాంది పలికారని అన్నారు. ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఒకటో వార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగింది. త్వరలోనే వార్డులో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరగనున్నాయని తెలిపారు. చిన్న వయసు అయిన కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యల కోసం కృషి చేస్తున్నాడని, శ్రీకాంత్ ఆధ్వర్యంలో వార్డు అభివృద్ధిలో ముందుకు పోతుందని, తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన వచ్చిన తర్వాత నిరుపేదలకు పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుంది. ఇప్పటికే లక్షలాది ఇళ్లు కట్టుకోవడం జరిగిందని, గృహ ప్రవేశాలు కూడా చేశారని అన్నారు. వైరా మున్సిపాలిటీ మేనేజర్ సుఈర్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకట్రావు, దార్న రాజశేఖర్, వీరంశెట్టి సీతారాములు, దేవిశెట్టి నర్సింహారావు, మరికంటి గోపి, బుడిగి వెంకన్న, గాజుల మహేష్, అమర్లపూడి ఆదాం, కురిసేటి వెంకటేశ్వర్లు, ఆర్పి ఆవుల జ్యోతి అధిక సంఖ్యలో వార్డు ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపముఖ్యమంత్రి భట్టిచొరవతో ఇల్లెందులపాడు సీసీ రోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిరంతర కృషి, ప్రత్యేక చొరవతో మధిర మున్సిపల్ పరిధిలోని ఇల్లెందులపాడు గ్రామంలో హిందూస్మశానవాటిక వెళ్లేదారిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత తెలిపారు. ఈ మేరకు బుధవారం వారు, ప్రముఖ వైద్యులు వాసిరెడ్డి రామనాథం కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ సుజాత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతీగ్రామానికి అభివృద్ధి ఫలాలు అందించడమే ధ్యేయంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ముందుకు సాగుతూ అందరిమన్ననలు పొందుతున్నారని కొనియాడారు. గ్రామీణ రహదారులు, తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కోనాధుని కుమార్, అభివృద్ధికమిటీ సభ్యులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మిర్యాల వెంకటరమణ గుప్తా, రంగా శ్రీనివాసరావు, తన్నీరు రామకృష్ణ, కరివేద సుధాకర్, ఈది అనిల్, కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తలుపుల వెంకటేశ్వర్లు, పారుపల్లి విజయ్‌కుమార్, సామినేని రామనాథం, బోడేపూడి గోపి తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీకి వెన్నెముక



**ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ:** కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని సంజీవరెడ్డి భవన్‌లో బుధవారం ఏర్పాటైన కమిటీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. కార్యకర్తలు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమపథకాలను , చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం జాతీయ ప్రతిభా అన్వేషణ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నూరంశెట్టి నాగభూషణం, మధిర నియోజకవర్గ ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూరంశెట్టి కిశోర్, జిల్లా అధికారప్రతినిధి కర్నాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణమూర్తి మృతి వ్యాపారవర్గానికి తీరనిలోటు



**ప్రజాపక్షం/మధిరమున్సిపాలిటీ:** ప్రముఖ కిరాణ వ్యాపారి, మాజీ వార్డు సభ్యుడు చలువాది చిన్నకృష్ణమూర్తి మృతి వ్యాపారవర్గానికి తీరనిలోటని ప్రముఖ వ్యాపారవేత్త పుల్లఖండం చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించి, అనారోగ్యంతో వ్యాపారి కృష్ణమూర్తి మృతి బాదాకరమని, వారి కుటుంబానికి ప్రగాఢసానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డోకుపర్తి సత్యబాబు, పల్లబోతు ప్రసాదరావు, కొల్లా శ్రీనివాసరావు, కాజా చక్రదర్‌రావు, బద్రీనాథ్, కోన సుబ్బారావు, సూరిబాబు, మల్లాచారి పాల్గొన్నారు.

# పంటల వ్యర్థాలను తగలబెడితే జరిమానా



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** రైతులు పొలాల్లో వ్యర్థాలను తగలబెడితే జరిమానా తప్పదని కొత్త కొత్తూరు సర్పంచి మాలోత్ కళావతి పేర్కొన్నారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. పంటవ్యర్థాలు భూమిలోనే కలియదున్నడం వల్ల పలు ప్రయోజనాలున్నాయని, తగలబెడితే రూ.5వేల నుంచి రూ.25వేల వరకు జరిమానా విధిస్తామని సూచించారు. ఈమేరకు రైతులు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రానున్న వ్యవసాయ సీజన్‌లో విత్తనాల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సభలో ఉపసర్పంచి వల్లాల రాధాకృష్ణ, వార్డుసభ్యులు గుగులోత్ వెంకటి, పాగర్తి శ్రీను, ఠాగూర్ రామ్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి రవి, జీపీఓ జానిమియా తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** సుదీర్ఘకాలం పాలన సాగిస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి భాజపా ఆధ్వర్యంలో బుధవారం క్షీరాభిషేకం , ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు ఫాగర్తి సుధాకర్ మాట్లాడుతూ..దేశానికి నిరంతరంగా సేవలు అందించిన నాయకుడిగా చారిత్రారిక రికార్డు సాధించారని, గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానిగా విరామం లేకుండా పాలన సాగిస్తూ మూడోసారి ప్రదానిగా బాద్యతలు చేపట్టి రికార్డు సృష్టించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు,అధికార ప్రతినిధి సూరేపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మొహినుద్దీన్, పురాణం దివాకర్, పుట్టా సత్యనారాయణ, కట్టా అప్పారావు, ఎలిగేటి వెంకటేశ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్న బిజెపి : కట్ల



**ప్రజాపక్షం/వైరాః** ఎన్నికల్లో పోటీ చేసే రాజ్యాంగ హక్కును బిజెపి కాళరాస్తుందని పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు అన్నారు. మంగళవారం కట్ల రంగారావు మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రేస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈసిని అడ్డుపెట్టుకొని తిరస్కరింపజేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమేనని అన్నారు. మీనాక్షి నటరాజన్‌పై బిజెపి నేతలు ఈసికి ఫిర్యాదు చేసినప్పటికి, అఫిడవిట్ పత్రాల్లో ఎలాంటి లోపాలు లేకున్నా కేవలం రాజకీయ దురుద్దేశంతో బిజెపి తప్పుడు విధానాలకు పాల్పడుతుంది. ఒక రాజ్యసభ స్థానం గెలవడం కోసం బిజెపి దిగజారుడు రాజకీయాలు ఉందన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన ప్రగతి



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో మండల పరిషత్ కార్యాలయం నందు గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో మున్సిపల్ కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ సీతారాములు పాల్గొన్నారు. వార్డులో లబ్దిదారుల నుండి సమస్యల వినతిపత్రాలు స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టే విధంగా అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముళ్ళపాటి విజయ సీతారాములు మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపట్టడం జరిగిది. ప్రజలకుఅ వసరాలను గుర్తించి వాటిని పరిష్కరించే ధ్యేయంగా పనిచేయడమే ప్రజాపాలన ప్రగతి కార్యక్రమం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మున్సిపల్ అధికారులు సుధీర్, వెంకట్రావు, తుమ్మల చిన్ని పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్



ప్రజాపక్షం/వైరా: వైరా నూతన మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటస్వామి బుధవారం వైరాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి శాలువాలు కప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్, జవ్వాజి నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మంపేట సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: తిమ్మంపేట గ్రామ పంచాయితీ పరిధిలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు గౌరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన గ్రామసభలో సర్పంచ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేద లందరికీ రెండో విడతలోనైనా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు. ఉపాధి పనుల వద్ద మౌలిక వసతులు కల్పించడంతో పాటు వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామసభల్లో ప్రజలు లేవనెత్తిన సమస్యలను అధికారులు ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ గణప సాయిరాం, పుప్పాల హరినాథ్, రాజనేని రాజు, సుధాకర్, సమ్మక్క, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల వనభోజనాలు



ప్రజాపక్షం/పినపాక: రానున్న వ్యవసాయ సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని అటవీ సంపద వృద్ధి చెందాలని ఆదివాసులు అడవికి వెళ్లి సామూహిక వనభోజనాలు, పూజాలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. ప్రకృతిలో మమేకమై జీవించే గిరిజనులు ఈ ఆచారాలను పినపాక మండలం ఏడూళ్ళబయ్యారంలో ఆదివాసీలంతా సాంప్రదాయ బద్ధంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. గ్రామంలోని ప్రజలంతా సమీపంలోని ఒకచోటికి వెళ్లి వన దేవతలకు(ప్రకృతికి)నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. పూజల అనంతరం అడవిలోనే వివిధ రకాల ధాన్యాలతో వంటలు వండి, అందరూ కలిసి సామూహికంగా వనభోజనాలు చేశారు. పశువులు అడవికి మేతకు వెళ్లినప్పుడు అటవీ జంతువుల బారిన పడకుండా వర్షాకాలంలో ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడాలని వన దేవతలను వేడుకున్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



ప్రజాపక్షం/పినపాక: పినపాక మండల పరిధిలోని పొట్లపల్లి గ్రామ పంచాయితీలో జరిగిన ప్రజాపాలన 99 రోజుల ప్లాన్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటూనే ప్రమాదం సంభవించినపుడు కుటుంబం నిరాశ్రయులు అవ్వకుండా పోస్టల ఎస్‌బిఐ వంటి తక్కువ సంవత్సరం చందాతో ఎక్కువ మొత్తం ఇన్సూరెన్స్ ఇచ్చే పాలసీలు తీసుకోవడం ద్వారా అనుకోకుండా ప్రమాదాలు సంభవిస్తే ఇంటి పెద్ద ఆయనపై ఆధారపడిన పిల్లలు, వృద్ధులకి తోడ్పాటుని అందించిన వారు అవుతామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సురేష్, వ్యవసాయ శాఖ ఏడిఏ తాతారావు, ఎంఈవో నాగయ్య, స్థానిక సర్పంచ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులు

**- రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి**
**- వ్యవసాయాధికారి బాబూరావు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఎల్‌నినో ప్రభావంతో జిల్లా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందని, రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారిస్తే మేలని వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక ఉండాలన్నారు. భూమిలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత విత్తనాలు వేసుకోవాలని, తేమ లేకుండా వేస్తే మొలక శాతం తగ్గి రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. ధృవీకరించిన నాణ్యమైన విత్తనాలు మాత్రమే వాడాలని, పొలాల్లో తమ సంరక్షణ చర్యలు చేపట్టాలని, రైతులు వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు, వాతావరణ నిపుణుల సలహాలు పాటించాలని తెలిపారు.

# జాగ్రత్తగా 'సాగు'దాం

**- విత్తనాల ఎంపికే అత్యంత కీలకం**
**- మార్కెట్లోకి నకిలీల జోరు**
**- రైతులు అప్రమత్తంగా ఉంటేనే మేలు**
**-వ్యవసాయాధికారులు సూచనలు సలహాలే ప్రధానం**
**- జోరందుకోనున్న సాగు పనులు**
**- యాప్ 15వ తేది నుండి అందుబాటులోకి వస్తుంది : ఏడి బాబూరావు**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : ఇక వానా కాలం పంటలు జోరందుకోనున్నాయి. రైతన్నలు పొలం బాట పడుతున్నారు. విత్తనాల ఎంపిక, ఎరువుల కొనుగోళ్లలో అన్నదాతలు బిజీబిజీ అయ్యారు. నికిలీ విత్తనాలు పెద్ద ఎత్తున మార్కెట్‌లోకి ప్రవేశిస్తుండటంతో రైతులు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తగా ముందుకు సాగకుంటే నట్టేట మునిగడం ఖాయం. నకిలీల పట్ల ఏమాత్రం ఏమర పాటుగా ఉన్నా దిగుబడి, పంట కాలం వృధా అయ్యే ప్రమాదం ఖచ్చితంగా ఉండటంతో పాటు అప్పులు పాలయ్యే ప్రమాదం ఉంది. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలతో పాటు శాస్త్రీయ సాగు పద్ధతులు పాటిస్తూ అత్యంత జాగ్రత్తలు తీసుకుంటేనే ఆరుగాల కష్టాన్ని ఫలితం దక్కుతుంది.

### విత్తన ఎంపికే ప్రధానం :

వ్యవసాయానికి విత్తనాల ఎంపికే అత్యంత కీలకం, ప్రధానం ప్రస్తుతం పరిస్థిల్లో రైతులను మోసం చేసేందుకు దళారులు రోడ్లెక్కారు. వారి మాటలి నమ్మి విత్తనాలు కొనుగోళ్లు చేస్తే అంతే సంగతి. ముఖ్యంగా పత్తి రైతులు నిషేదిత గ్లైసిల్ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనొద్దని నిపుణులు చెబుతున్నారు. రైతులను ఆకర్షించేందుకు ప్రైవేటు కంపెనీలు ఎత్తుగడలతో కొత్త రంగులతో అందమైన పేర్లు, మిళమిళా మెరిసిపోయే ప్యాకెట్లతో ముందుకు వస్తుంటారు. వీటిని చూసి మోసపోవద్దద్దు, విత్తనాన్ని ఎంపిక చేసుకునే ముందు వ్యవసాయాధికారి, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకోవడం తప్పని సరి. లైసెన్సు కలిగిన దుకాణాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ సరఫరా చేసిన విత్తనాలు కొనుగోలు చేస్తే మేలు. రైతులు కొనుగోలు చేసే ముందు బస్తాల ధృవీకరణ పత్రం, సీల్ చేసిన ప్యాకెట్లు. రకం పేరు, గడువు తేది, ల్యాబ్ పరీక్షల నెంబర్లను తప్పకుండా గమనించాల్సి ఉంటుంది. అంతే కాకుండా గడువు తేది పొందుపరుస్తూ డీలర్ వద్ద నుండి రశీదు తీసుకోవడం తప్పనిసరి.

### ఎరువులు, పురుగు మందులతో అప్రమత్తం :

రసాయ ఎరువులు కొనుగోళ్ల విషయంలో ఎంతో అప్రమత్తత పాటించాలి. మిషన్ కుట్టు ఉన్న ఎరువుల బస్తాలను మాత్రమే కొనాలి. బస్తాపై ప్రామాణిక పోషకాలు, ఉత్పత్తి దారుల వివరాలు సరిచూసుకోవాలి. బస్తా బరువులో ఏ మాత్రం అనుమానం ఉన్నా వెంటనే తూకం వేయడం మంచిది. చిరిగిన, రంధ్రాలు పడ్డ బస్తాలు తీసుకోవద్దు. ఖాళీ సంచులు పంట కాలం పూర్తయ్యేంత వరకు భద్ర పరచాలి. ఎరువుల విషయంలో అనుమానం వస్తే అప్రమత్తం కావాలి. ఇక చీడపీడలకు వాడే క్రిమి సంహారకర మందుల విషయంలో తీసుకునే జాగ్రత్తలే ఎంతో మేలు. ప్రధానం వ్యవసాయశాఖ సూచించిన మందులను మాత్రమే కొనుగోలు చేస్తే మంచిది. నిషేదిక మందుల జోలికి పోతే రైతులు కాలు జారి పడినట్లే. ఇళ్ల వద్ద అవసరానికి మించి పురుగు మందులు నిల్వాలు ఉంచడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. లేబుల్, మందు పేరు, విషప్రభావం, పరిమాణం, వాడకంలో సూచనలు, జాగ్రత్తలు, విరుగుడు మందులు, బ్యాచ్ నెంబర్లు, వాడాల్సిన గడువు, తయారీ సంస్థ పేరు, రిజిస్ట్రేషన్ విషయాలు తప్పకుండా గమంచాలి. వాడిన మందు సీసాలు, డబ్బాలు, ప్యాకెట్లును ధ్వసం చేసి పాతిపెట్టాలి. మందుల మిశ్రమాన్ని కలిపిన పాత్రలను వేరే అవసరాలకు వాడకుండా ఉంటే మంచిది. విచక్షణా రహితంగా పురుగు మందుల వాడకం మంచింది కానే కాదు.

### రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి: బాబూరావు, ఏడి



విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కొనుగోళ్ల విషయంలో రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. లూజు విత్తనాలపై మక్కువ చూపకండి. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. సరైన మొలకలు రాకపోవడం, దిగుబడి తగ్గడం వంటి సమస్యలు ఎదురైతే కంపెనీల ఉండి నష్ట పరిహారం పొందవచ్చు. క్రిమి సంహారక మందుల వాడకం తగ్గించి సహజ సిద్ధమైన పద్ధతులతో వ్యవసాయం చేయాలి. ఎరువులను యాప్ ద్వారానే బుక్ చేసుకోవాలి. ఈనెల 15వ తేది నుండి యాప్ అందుబాటులోకి వస్తుంది.

# సర్వే నెం.184 భూముల వివాదం

**-ప్రజలకు ఇళ్ల అనుమతులపై ఇబ్బందులు**
**-సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి**

ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణ పరిధిలోని అయ్యగారిపేట రెవెన్యూ ప్రాంతంలో ఉన్న సర్వే నంబర్ 184 భూములకు సంబంధించిన వివాదం కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం, 1950లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కల్లూరు అశ్వారావుపేట, తల్లాడ కొత్తగూడెం, కొత్తగూడెం బూర్గంపాడు, పాకాల ఎల్లందు రహదారుల ఇరుపక్కల 201 మీటర్ల వరకు ఉన్న అటవీ భూములను డీ రిజర్వ్ చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలకు వ్యవసాయ అవసరాల కోసం అసైన్ చేయాలని అప్పటి వరంగల్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంటున్నారు. అదే క్రమంలో సత్తుపల్లి అయ్యగారి పేట రెవెన్యూ పరిధిలో సుమారు 785 ఎకరాల భూమిని డీ రిజర్వ్ చేసి పోరంబోకు భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం 1976లో సత్తుపల్లి పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలు, విద్యాసంస్థలకు భూములు కేటాయించే సమయంలో అటవీ శాఖ టింబర్ డిపో కోసం 25 ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు వచ్చినట్లు సమాచారం. అయితే, ఆ సమయంలో అటవీ శాఖ ఈ భూమిలో కేవలం 250 ఎకరాలు మాత్రమే రెవెన్యూ శాఖకు చెందినవని అభ్యంతరం వ్యక్తం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వివాదాన్ని ఆధారంగా చేసుకుని ప్రస్తుతం సర్వే నంబర్ 184 లోని విస్తారమైన భూములను అటవీ భూములుగా చూపుతూ నిషేధిత (ప్రొహిబిటెడ్) జాబితాలో కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.ఇదే భూమిలో ప్రభుత్వం లేఅవుట్లు రూపొందించి ప్రజలకు ప్లాట్లు విక్రయించిందని, ద్వారకాపురి, గాంధీనగర్ వంటి



ఎస్సీ, బీసీ కాలనీలు కూడా ఏర్పాటయ్యాయని వారు గుర్తు చేస్తున్నారు. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో మున్సిపల్ అధికారులు అటవీ భూముల అంశాన్ని ప్రస్తావిస్తూ అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీంతో ప్రజలు క్లియరెన్స్ కోసం రెవెన్యూ శాఖ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని, అనుమతుల మంజూరులో జాప్యం జరుగుతోందని, కొంతమంది లంచాలు చెల్లించి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు రాష్ట్ర రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్ 184 భూముల యాజమాన్యంపై స్పష్టత ఇచ్చి, ప్రజలు ఇళ్ల నిర్మాణ అనుమతులు పొందడంలోఎదుర్కొంటున్నఇబ్బందులనుతొలగించాలనివిజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజా చైతన్యమే ప్రమాదాల నివారణకు కీలకం

**-ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి**
**-రోడ్ సేఫ్టీ గ్రామసభలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**






ప్రజాపక్షం/జూలూరుపాడు: ప్రజా చైతన్యమే రోడ్డు ప్రమాదాల నివారణకు కీలకమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం జూలూరుపాడు యల్లంకి గార్డెన్స్ నందు ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం,సీటు బెల్ట్ ప్రాధాన్యత,డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ కలిగి ఉంటే చాలావరకు రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని అన్నారు. గ్రామాలలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసుకొని రోడ్డు భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా,లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ, నిబంధనలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కోరారు.డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు నడుపుతూ కనిపించినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అనంతరం గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వాటి ప్రాముఖ్యత వివరించారు. గొడవలు, దొంగతనాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడానికి కేసుల పరిష్కారానికి సహాయపడతాయని గ్రామ ప్రజలకు వివరించారు. అనంతరం సైబర్ నేరాలపై ఎస్పీ అవగాహన కల్పించారు.అత్యాశకు పోయి త్వరితగతిన డబ్బును సంపాదించాలనే ఆలోచనతో చాలామంది సైబర్ నేరాల బారిన పడి కష్టపడి సంపాదించిన నగదును కోల్పోతున్నారని తెలిపారు. చదువుకున్నవారే ఎక్కువమంది సైబర్ నేరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఓటీపి ట్రాప్, ఆన్లైన్ ట్రేడింగ్, సోషల్ మీడియాల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల గురించి వివరించారు. ప్రభుత్వ నిషేధిత గంజాయిని ఎవరైనా సరఫరా చేస్తున్నట్లుగానీ, సేవిస్తున్నట్లు గానీ తెలిస్తే వెంటనే పోలీసువారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు. చాలామంది యువత గంజాయి మత్తుకు బానిసలై తమ అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎవరైనా గంజాయి సేవిస్తూ పోలీసులు పట్టుబడితే కేసు నమోదు చేయడమే కాకుండా జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ప్రతి ఒక్క పౌరుడు బాధ్యత. ప్రజల సహకారంతోనే నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దగలమని అన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ , మోటారు వాహనాల అధికారి వెంకట రమణ, ఎస్పి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి , ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు,ఎస్సైలు ,సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మీనాక్షి నాటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి విఘాతం

**-కాంగ్రెస్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్**

ప్రజాపక్షం/బూర్గంపాడు: రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఏఐసీసీ సభ్యురాలు మీనాక్షి నాటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ తీవ్రంగా ఖండించారు. బూర్గంపాడు ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీనాక్షి నాటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని, ఇది కేవలం సాంకేతిక లోపం పేరుతో తీసుకున్న నిర్ణయం కాదని ఆరోపించారు. అఫిడవిట్‌లో కేసు ప్రస్తావన లేకపోవడాన్ని కారణంగా చూపి నామినేషన్‌ను తిరస్కరించారని, అయితే ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థికి సవరణ చేసుకునే అవకాశం కల్పించాల్సి ఉండగా ఉద్దేశపూర్తకంగానే ఆ అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్న నేపథ్యంలో వాటి ప్రభావాన్ని తట్టుకోలేక రాజకీయ ప్రత్యర్థులు ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుతో ప్రజల విశ్వాసాన్ని పొందుతోందని, ఆ ప్రజాదరణను అడ్డుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. రాజ్యసభలో తెలంగాణ తరపున బలమైన స్వరం వినిపించే నాయకురాలిగా మీనాక్షి నటరాజన్ ఎదుగుతుండటాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే ఆమె నామినేషన్‌ను అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని భజన సతీష్ పేర్కొన్నారు. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తుందని, ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు




హైకోర్టును ఆశ్రయించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్నలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా సాగాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నపాటి సాంకేతిక కారణాలను చూపి నామినేషన్‌ను తిరస్కరించడం దురదృష్టకరమని, తెలంగాణ ప్రజల తరపున బలంగా మాట్లాడగల నాయకత్వాన్ని అడ్డుకునే ప్రయత్నాలు ప్రజలు సహించరని అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల వ్యవస్థపై ఉందని పేర్కొన్నారు. నామినేషన్ తిరస్కరణ ఘటన ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించాల్సిన సమయంలో సవరణకు అవకాశం ఇవ్వకుండా తీసుకున్న నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. ఇలాంటి చర్యలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, ప్రజల తీర్పే అంతిమమని అన్నారు. ఈకార్యక్రమంలో పినపాక నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎడమకంటి సుధాకర్‌రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మల హరీష్ యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దునుకు రాము, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ సింప్లి సాయి, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు

**-నేడు ర్యాలీ .. బహిరంగ సభ**
**-హాజరుకానున్న అఖిల భారత నాయకులు.**
**-ప్రజా సమస్యలపై భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన**
**వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**

ప్రజాపక్షం/మణుగూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం 4వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని నేడు జరిగే వ్యవసాయ కార్మికుల ర్యాలీకి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. నేడు జరగబోయే జిల్లా మహాసభలకు 23 మండలాల నుండి హాజరయ్యే ప్రతినిధులకు సాధార స్వాగతం పలుకుతున్నామన్నారు. మహాసభల సందర్భంగా మణుగూరులో భారీ ర్యాలీ ఉంటుందన్నారు. స్థానిక శ్రామిక భవన్ నుండి కిన్నెర కల్యాణ మండపం వరకు మహా ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. ఈ మహాసభలకు వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు నల్ల చట్టాలను తిప్పికొట్టేందుకు, పేద ప్రజల ఉపాధిని సమాధి చేసేందుకు తీసుకొచ్చిన వి బి జి రామ్ జి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఈ మహాసభలో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. జిల్లా మహాసభలలో గతంలో నిర్వహించిన పోరాటాలను సమక్షించుకొని భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు.

## పోడు సాగుదారుల హక్కులను కాలరాస్తున్న అటవీ అధికారులు



ప్రజాపక్షం/దమ్మపేట: సత్తుపల్లి మండలం కాకర్లపల్లి బీట్ పరిధిలోని గుడిపాడు శివారులో దశాబ్దాలుగా సాగు చేస్తున్న గిరిజన రైతులపై అటవీ శాఖ అధికారులు వేధింపులకు పాల్పడటం దుర్మార్గమని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము విమర్శించారు. గతంలో సర్వే నిర్వహించి 60 ఎకరాలకు పట్టాలు ఇచ్చినా, సాంకేతిక కారణాలతో మిగిలిన భూములకు పట్టాలు రాకపోవడం అధికారుల వైఫల్యమేనన్నారు. పట్టాలు లేవనే కారణంతో పోడు సాగుదారులపై దాడులు, కేసులు నమోదు చేయడం గిరిజన హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. గిరిజన మహిళలపై దాడులు, భూముల్లో కందకాలు తవ్వడం వంటి చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న భూములకు హక్కు పట్టాలు మంజూరు చేసి గిరిజన రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## రెవెన్యూ అధికారులపై దౌర్జన్యం సరికాదు



ప్రజాపక్షం/కారేపల్లి: మండలంలో అధికార పార్టీ అండదండలతో, ఎంఎల్ఏ అనుచరులమంటూ అక్రమ మట్టి తరలింపులకు పాల్పడటమే కాకుండా అడ్డుకున్న అధికారులపై దౌర్జన్యాలకు దిగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర విమర్శించారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ గోదాం నిర్మాణం పేరుతో గుట్టకిందగుంపు గంగాదేవి గుట్ట ప్రాంతంతో పాటు, కొత్త తండా గ్రామ పంచాయితీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రకృతి వనరులను నాశనం చేస్తూ జరుగుతున్న ఈ అక్రమ కార్యకలాపాలను అడ్డుకునేందుకు వెళ్లిన అధికారులపైనే దౌర్జన్యాలకు పాల్పడటం చట్టాన్ని సవాల్ చేయడమేనన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం నాయకులు వజ్జా రామారావు, తలారి దేవప్రకాష్, వడ్డే అజయ్ బాబు, బానోత్ బన్సీలాల్, కేసగాని ఉపేందర్, అజ్మీర శోభన్, సీతారాములు, రామ్మూర్తి, సైదులు, మల్లయ్య పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ



ప్రజాపక్షం/కారేపల్లి: మండలంలోని విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన సుతారి మేస్త్రి చిత్తులూరి వీరయ్య(48), కొమ్ముగూడెం గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి మోకాళ్ల బుచ్చిరాములు(50)అనారోగ్యంతో మృతి చెందడంతో బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు మనిషా లక్ష్మి వారి స్వగ్రామాలకు వెళ్లి నివాళులర్పించారు. ఈసందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబాలకు ధైర్యం చెప్పి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు షేక్ గౌసుద్దీన్, బీఆర్ఎస్ నాయకులు తాత వెంకన్న, లకావత్ రాము, జడల కళ్యాణ్, డొంకేనా రవీందర్, పల్లపాటి ఉపేందర్, రాజేష్, హరీష్, ఖలీల్ ఉల్లా ఖాన్, రవీందర్‌రెడ్డి, తాత ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ముట్టడికై తరలిన సిపిఐ శ్రేణులు



ప్రజాపక్షం/చుంచుపల్లి: గ్యాస్, పెట్రోల్ మరియు డీజిల్ ధరల పెరుగుదలను నిరసిస్తూ బుధవారం సిపిఐ పార్టీ పిలుపు మేరకు కలెక్టరేట్ ముట్టడికి చుంచుపల్లి మండలం విద్యానగర్ గ్రామపంచాయతీ నుండి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి సారధ్యంలో సిపిఐ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కలెక్టరేట్‌కు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా వాసిరెడ్డి మురళి మాట్లాడుతూ రోజు రోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, ఇంధన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావం అన్ని రంగాలపై పడుతూ ప్రజలపై అదనపు భారం మోపుతోందని ఆవేదన వ్య_ం చేశారు. ప్రభుత్వం వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని, ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండిస్తూ నినాదాలు చేస్తూ మోటార్ బైక్‌పై కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్ళారు.

## 30 బారికేడ్లు వితరణ



ప్రజాపక్షం/మణుగూరు: మణుగూరు ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని మణుగూరు అంబేద్కర్ సెంటర్ లో ఉన్న నాగార్జున సిమెంట్ డీలర్ సరస్వతి ఐరన్ ఓనర్ పీవీఎన్ రాజు తన సొంత ఖర్చులతో మణుగూరు పోలీస్ స్టేషన్ వారికి 30 బారికేడ్లు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మణుగూరు సీఐ నాగబాబు సరస్వతి ఐరన్ ప్రొప్రయిటర్ పీవీఎన్ రాజు, నాగార్జున సిమెంట్స్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వి.వి. సత్యనారాయణ, జి. కిరణ్ కుమార్ రాజు, జి. శోభన్ పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీల అమలు



-రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద సమస్యకు పరిష్కారం
-పారిశుధ్యం, పచ్చదనాన్ని పెంపొందించాలి
-బిటి రోడ్లు, సిసి డ్రైన్ పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని ఎఫ్‌సిఐ గోడౌన్ నుంచి బైపాస్ రోడ్డు వరకు రూ.3.05 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు, సిసి డ్రైన్ నిర్మాణ పనులకు సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలెండర్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, యంగ్ ఇండియా పాఠశాలల ఏర్పాటు వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇంట్లో కూడా అన్ని పనులు ఒకేసారి చేయలేమని అదేవిధంగా ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దశల వారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గుడిసెల్లో నివసిస్తున్న పేదలకు, కొత్త ఇండ్ల మంజూరుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో మూడు రోజులకొకసారి త్రాగునీరు సరఫరా జరిగేదని ప్రస్తుతం ప్రతి రోజు త్రాగునీటిని అందించే దిశగా చర్యలు తీసకుంటున్నామన్నారు. మున్నేరు వరదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలని, రోడ్లు, డ్రైన్లు నాణ్యతపై దృష్టి పెట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచకపోతే ప్రజల ఆదాయం ఆసుపత్రికి వెచ్చించాల్సి వస్తుందని తెలిపారు. ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా, పచ్చదనం ఉండేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరం వేగంగా అభివృద్ధి చెందుతుందని రోడ్ల విస్తరణ, జాతీయ రహదారుల నిర్మాణంతో వ్యాపార అవకాశాలు పెరుగుతున్నాయని మంత్రి తెలిపారు. సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మం నగర అభివృద్ధిపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. మున్నేరు వరద సమస్యకు పరిష్కారంగా రూ. 600 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి తుమ్మల కృషి చేశారన్నారు. వెలుగుమట్ల అర్బన్ పార్కు అభివృద్ధి తో పాటు ఖమ్మం ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులు కూడా జరుగుతున్నాయన్నారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు డివిజన్లలో రోడ్లు, డ్రైన్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పారిశుధ్యం, పచ్చదనం పెంపుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్ బాబా, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బసవతారకం ఆసుపత్రికి నగదు వితరణ

-త్రివేణి పాఠశాల విద్యార్థులను అభినందించిన బాలకృష్ణ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి త్రివేణి పాఠశాల విద్యార్థులు సేకరించిన సహాయ నిధి రూ.1,01,116 అందజేశారు. బుధవారం ప్రముఖ సినీ నటుడు, బసవతారకం ఆసుపత్రి ఛైర్మన్, పద్మ భూషణ్, నందమూరి బాలకృష్ణ జన్మదిన సందర్భంగా బసవతారకం ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణను త్రివేణి పాఠశాల డైరెక్టర్ డా॥ గొల్లపూడి వీరేంద్రచౌదరి కలిసి విద్యార్థులు సేకరించిన నిధిని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈసందర్భంగా వీరేంద్రచౌదరి మాట్లాడుతూ త్రివేణి సంస్థలు మానవత్వం మనిషి తత్వం అనే నినాదంతో అనేక చారిటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో, మథర్ థెరిసా జయంతి సందర్భంగా, సీతారాముల కళ్యాణ మహోత్సవంలో మజ్జిగ, మంచినీటి ప్యాకెట్ల పంపిణీ, జై జవాన్ జైకిసాన్ అనే నినాదంతో నిధిని సేకరించి ప్రతి ఏడాది గవర్నర్ సహాయ నిధికి అందజేయడం జరుగుతుందన్నారు. సినీ నటుడు బాలకృష్ణ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థుల సహాయ, సేవా నీరతిని కొనియాడారు. పిల్లలు యువతరానికి నాయకులు, నవతరానికి వారధులన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి పాఠశాలకు చెందిన సివో అడ్మిన్ అప్పారావు, సిఆర్‌వోలు వెంకట్రావు, సాయి నర్సింహారావు, సుబ్బారావు, చెంచారావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న బిజెపి ప్రభుత్వం




**ప్రజాపక్షం/వైరాః** భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయ సాగును ప్రోత్సహించే దిశగా ఖమ్మం జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాతీయ కిసాన్ మోర్చా జాతీయ కమిటీ సభ్యులు గోలి మధుసూదనరెడ్డి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరు రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రైతు సదస్సులో కెవికె శాస్త్రవేత్తలు ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారాన్ని పెంపొందించడం, రసాయన రహిత ఆహార ఉత్పత్తి, రైతుల సాగు ఖర్చులను తగ్గించడం, పర్యావరణ పరిరక్షణతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే మార్గాలపై రైతులకు అవగాహన కల్పించారు. కిసాన్ మోర్చా జాతీయ కమిటీ సభ్యులు గోలి మధుసూదనరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మోడీ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు గ్రామీణ స్థాయిలో విస్తరింపజేయాలని, ప్రతి రైతు సేంద్రీయ సాగు వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమం కోసం ఫసల్ భీమా యోజన పథకం సబ్సిడీపై ఎరువులు అందిస్తున్నారని అన్నారు. భూమి ఆరోగ్యమే రైతు భవిష్యత్తు ప్రకృతి వ్యవసాయమే సుస్థిర వ్యవసాయానికి మార్గం అని అన్నారు. సేంద్రీయ వ్యవసాయం ద్వారా అధిక దిగుబడులు రాబట్టాలని రైతులను కోరారు. అనంతరం కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుకూరు రమేష్, భాజపా జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, జిల్లా కిసాన్ మోర్చా నాయకులు నరుకుల వెంకటేశ్వర్లు, ఆపతి వెంకటరామారావు, బిజెపి వైరా పట్టణ అధ్యక్షుడు దోసపాటి కళ్యాణ్, రైతులు రాయపాటి వెంకటేశ్వర్లు, పాటి కళ్యాణ్‌రావు, ఉదతనేని విశ్వేశ్వరరావు, గొట్టిపోల్ల శ్రీనివాస్, సిరిపురం ప్రసాద్, మాదినేని వెంకటేశ్వర్లు, వైరా కెవికె శాస్త్రవేత్తలు, డాక్టర్ చైతన్య, ఫణిశ్రీ, సరస్వతి పాల్గొన్నారు.

## ఖమ్మం నగరంలో మంత్రి తుమ్మల పర్యటన




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించారు. బుధవారం ఖమ్మం మమత రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన విజేత సూపర్ మార్కెట్‌ను, ఇల్లందుక్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన స్కిన్ ఎక్స్ ఆసుపత్రిని, నూతన బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన బచ్‌పన్ స్కూల్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని, విద్యార్థులకు వినూత్న విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండి ఖాదర్‌బాబా, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ ఘటన కలిచివేసింది : తుమ్మల

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో మైనర్‌పై జరిగిన దారుణ ఘటన తీవ్రంగా కలిచి వేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన సమాజాన్ని తీవ్రంగా కలిచివేసే విషయమని ఈ దారుణ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. బాలికల భద్రత విషయంలో ఎలాంటి రాజీకి చోటు లేదని, ఇలాంటి ఘటనలు మరల జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధితురాలికి తక్షణ వైద్య సాయం, మానసిక మద్దతు, పూర్తి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. నిందితున్ని కఠినంగా శిక్షించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## పులిపాటి ప్రసాద్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యా, సామాజిక సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తూ వేలాది మందికి స్ఫూర్తిగా నిలిచిన ప్రముఖ విద్యావేత్త డా॥ పులిపాటి ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పులిపాటి ప్రసాద్ రెండవ సారి నియమితులైన సందర్భంగా బుధవారం తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ సంఘం, వాసవీ క్లబ్ పులిపాటి నగర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 2008లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చేతుల మీదుగా పులిపాటి ప్రసాద్ వాగ్దేవి విద్యా పురస్కారం అందుకున్నారన్నారు. పులిపాటి ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నిరుపేదలకు విద్యా, ఆర్థిక సాయం, అన్నదాన సేవలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా పులిపాటిప్రసాద్ రెండవ సారి బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిద్దంశెట్టి శ్రీకాంత్,కోదుమూరు భద్రయ్య, కోదుమూరు జగన్నాథం, వరప్రసాద్, కొంకిమళ్ల మృత్యుంజయ గుప్తా, పాలవాయి వెంకటేశ్వర్లు, దాసా శ్రీనివాసరావు, వజినేపల్లి చంద్రశేఖర్ గుప్తా, తేలుకుంట్ల ఓంకార్, వెల్లంపల్లి వెంకట సుబ్బారావు, విశ్వనాథ్ గుప్తా, కాజా వెంకటేశ్వరరావు, సుగ్గల శ్రీహరి, గోపాలరావు, అరవింద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ బస్సు ఢీ

**ఇద్దరికీ తీవ్ర గాయాలు..**



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు లోని మధిర బ్రాంచ్ ఎన్‌ఎస్పి కాలువ బ్రిడ్జ్ పై ద్విచక్ర వాహనం ను ప్రైవేట్ బస్సు బుధవారం సాయంత్రం ఢీకొనటంతో భార్యాభర్తలకు తీవ్ర గాయాలు అవటంతో అంబులెన్స్ లో కల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏడుకొండలు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కోటమ్మ కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం పొందుతుంది. వెంటనే సమాచారం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చంద్రరావు, కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు లతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు వెంటనే స్థానిక ఎమ్మెల్యే రాగమయికి ఫోన్ ద్వారా సమాచారం అందించే పరిస్థితిని తెలుసుకొని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం అందించాలని సమాచారం అందించారు. ప్రైవేటు బస్సును కల్లూరు పోలీస్ స్టేషన్లో ఉంచారు.

## త్రీమెన్ కమిటీ ఆధ్వర్యంలో ముఖాముఖిలు



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం:** మండలంలో వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో భర్తీ చేయనున్న ప్రీ ప్రైమరీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు త్రీమెన్ కమిటీ సభ్యులైన తహసీల్దార్, ఎంఈఓ,ఎంపీడీఓలు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో బుధవారం ముఖాముఖిలు నిర్వహించారు. మండలంలోని రాజులదేవరపాడు, చొప్పకట్లపాలెం, జమలాపురం, వెంకటాపురం గ్రామాల్లోని పాఠశాలల్లో ప్రీప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్, ఆయా పోస్టులకు ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఈ మేరకు త్రీమెన్ కమిటీ సభ్యులు తహసీల్దార్ కె.సునీత ఎలిజిబెత్, ఎంఈఓ బి.మురళిమోహన్‌రావు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు పూర్తి నిబద్ధతతో, విద్యార్థులందరి అభ్యున్నతికి కృషిచేయాలని సూచించారు.

# ప్రజల కోసం పోరాడిన ఆదర్శ ప్రజా నాయకుడు కన్నయ్య



**- కన్నయ్య మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి, చర్ల ప్రాంత ప్రజలకు తీరని లోటు**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/చర్ల :** మెడికల్ కాలేజీ విద్యార్థుల పరిశోధన కోసం సమాజహితం కోరుతూ సిపిఎం సీనియర్ నాయకులు మచ్చా కన్నయ్య తమ మృతదేహాన్నిదానం చేయడం అత్యంత సాహసోపేత నిర్ణయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వరరావు తండ్రి, ఆ పార్టీ సీనియర్ నాయకులు కన్నయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం చర్లలో మచ్చా నివాసాన్ని సందర్శించిన ఆయన కన్నయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ కన్నయ్య తన చరమాంకం వరకు ప్రజాసేవకే అంకితం అయ్యారని చెప్పారు. మరణానంతరం కూడా సమాజ శ్రేయస్సును కోరి మృతదేహాని వైద్య విద్యార్థుల కోసం ఇవ్వడం ఎంతో గొప్పవిషయం అని, ఇది వారి కుటుంబ సంస్కారానికి నిదర్శనం అన్నారు. చర్ల ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి ఆయనచేసిన సేవలు ప్రజల్లో చిరస్థాయిగా ఉండిపోతాయన్నారు. కన్నయ్య మృతి ఉద్యమానికి, చర్ల ప్రాంత ప్రజానికానికి తీరనిలోటని చెప్పారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే కన్నయ్యకు ఇచ్చే నిజమైన నివాళి అని చెప్పారు. నివాళ్లర్పించిన వారిలో మైనార్టీ సంఘాల నాయకులు నయూమ్ ఖురేషి, సిపిఐ నాయకులు కల్లూరి వెంకటేశ్వరరావు, అడ్డగర్ల తాతాజీ, కన్నయ్య కుమారులు మచ్చా వెంకటేశ్వర్లు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో రైళ్లు ఆపాలి



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం రైల్వే స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లకు హాల్టింగ్ కల్పించి, ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని తుమ్మలవారి గూడెం సర్పంచ్ కుంజ జాన్, ఉప సర్పంచ్ ధరావత్ హర్ష నాయక్ రైల్వే శాఖను డిమాండ్ చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ అశ్వాపురం, పరిసర గ్రామాల ప్రజలకు ఈ రైల్వే స్టేషన్ కీలక కేంద్రంగా ఉన్నప్పటికీ రైళ్లు ఆగకపోవడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్టేషన్ ఉన్నా ప్రయాణాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. అశ్వాపురం స్టేషన్‌లో ప్యాసింజర్ రైళ్లు తప్పని సరిగా ఆగేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రయాణికుల భద్రత కోసం ఫ్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. రాత్రి వేళల్లో ప్రయాణికుల సౌకర్యార్థం హైమాస్ట్ లైట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, టికెట్ల కోసం స్థానికంగా టికెట్ కౌంటర్ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. త్వరలోనే రైల్వే ఉన్నతాధికారులకు వినతి పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలాభివృద్ధి లక్ష్యం : కలెక్టర్

**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్రాభివృద్దే లక్ష్యమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభల్లో భాగంగా బుధవారం స్థానిక పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, పురోగతి వివరాలు ప్రజలకు వివరించారు. అనతంరం ఆయన మాట్లాడుతూ నేడు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, గ్రామీణాభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యంతో మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనే పరిస్థితి ఉందని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని సూచించారు. గత సీజన్లో రైతులకు ఇబ్బందులు కలిగించిన పిఆర్ 126 వరి రకాన్ని సాగు చేయకుండా వేరే పంటలపై దృష్టి పెట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా అధిక దిగుబడులు ఆదాయం సాధించవచ్చని తెలిపారు. వర్షాకాలం గ్రామపంచాయితీలు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.



మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, తడిపొడి చెత్తను వేరు చేయాలని చెప్పారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులందరికీ మంజూరు చేస్తామని చెప్పారు. పారదర్శకమైన ఓటరు జాబితా తయారీ కోసం ఎస్ఐఆర్ కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ స్వర్ణ, ఎంపిడిఓ మహాలక్ష్మి, ఎంపిఓ షబానా, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ అనూష, ఇంతర మండలాధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఖమ్మం రాపర్తి నగర్‌లో 12 ఏండ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టి హత్యాయత్నానికి పాల్పడిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ డబ్ల్యూ) జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ వీసంశెట్టి పద్మజ డిమాండ్ చేశారు. బుధవారం ప్రజాపక్షంతో ఆమె మాట్లాడుతూ దేశంలో నిమిష నిమిషానికి ఏదో ఒకచోట మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలను అత్యంత కఠినంగా అమలు చేయకపోవటంతోనే ఇలాంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మంలో అపార్ట్‌మెంట్ ఆడుకొంటున్న అభంశుభం తెలియని పసిపాపను తన మాయమాటలతో తీసుకెళ్ళి అత్యాచారం చేసి మూడంస్థుల భవనంపై నుండి కిందపడేసి హత్యాయత్నానికి ఒడిగట్టడం అత్యంత పాశవిక చర్యగా అభివర్ణించారు. నిందితుడు గౌస్‌ను మరింత కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మణుగూరులో బస్టాండ్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలి



**తహశీల్దార్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా**

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు పట్టణంలో ప్రతిపాదిత బస్టాండ్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత తెలంగాణ ప్రభుత్వ హయాంలో అప్పటి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు కృషితో మణుగూరు బస్టాండ్ నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించారని గుర్తు చేశారు. 2023 సెప్టెంబర్ 9న అప్పటి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చేతుల మీదుగా భూమి పూజ కూడా నిర్వహించినప్పటికీ, ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాకపోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో మణుగూరు అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు తీసుకొచ్చామని, కానీ ప్రస్తుత ప్రజాప్రతినిధులు కొత్తగా ఒక్క అభివృద్ధి పనిని కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. శంకుస్థాపనలతో కాలయాపన చేయడం తప్ప ప్రజలకు అవసరమైన పనులు చేపట్టడం లేదని ఆరోపించారు. మణుగూరు బస్టాండ్ నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడ తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వట్టం రాంబాబు, ఎడ్ల శ్రీను, ధర్మావత్ నరసింహారావు, షేక్ కరిష్మా, ఎదలపల్లి శారద, వాం కుడోత్ నాగేంద్రబాబు, మూడి తిరుమల, గుండి గౌరీ, గుండి సర్వే శ్వరరావు, కంభంపాటి శ్రీను, బుద్దుల ప్రసాద్, కట్ట రాజ్‌కుమార్, వన మాల రాంబాబు, గంజి నరేందర్, పైన్నమనేని హేమంతరావు, కుమ్మరికుంట్ల వెంకటసోములు, సూత్రపు నాగభూషణం, పల్లపు శ్రీను, సుతారి వెంకన్న, మూడ్ చందర్, బోయల సృజన, షేక్ గౌసియా, రేగులగడ్డ సుజాత, కలబోయిన సుబ్రమణ్యం, ఉసికెల రమణ, తెప్పలి లక్ష్మి, ఐతరాజు సాయికుమార్, ఆటో గోపి తదితరులు పాల్గొన్నారు.

# ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

**- చిన్నారి మృతి, నలుగురికి గాయాలు**



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్థానిక ఇందిరానగర్ కాలనీ సాయిబాబ దేవాలయం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొట్టడంతో ఓ చిన్నారి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే విశాఖపట్నంకు చెందిన అమెరికాలో ఉద్యోగం చేస్తున్న అనురాగ్ తన కుటుంబ సభ్యులతో మధిరలో గల బంధువుల వద్దకు వచ్చారు. అక్కడి నుండి తన కూతురు ఆద్య (5), భార్య, బంధువులు పద్మావతి, క్రిష్ణకేశవ్‌తో కలిసి మధిర నుండి భద్రాచలం దైవ దర్శనానికి బయలు దేరారు. ఈ క్రమంలో పాల్వంచ ఇందిరా కాలనీలో అదుపుతప్పిన కారు ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టింది. దీనితో చిన్నారి ఆద్య అక్కడికక్కడే మృతి చెందగా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షగాత్రులను హుటాహుటిన పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు.

# మెరుగైన వైద్య సేవలను అందించాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి తుకారాం రాథోడ్ అన్నారు. మండల పరిధి జగన్నాధపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఇందిరా కాలనీ, సోములగూడెంలలోని ఉపకేంద్రాలను బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సంధర్భంగా ఉపకేంద్రం మూసివేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంభంధిత డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్ వైద్యాధికారికి మెమో జారీ చేయాలని ఆదేశించారు.ఇందిరాకాలనీ రోగులకు స్వయంగా రక్తపోటు పరీక్షలు చేసి, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. బరువు కొలిచే యంత్రాన్ని వెంటనే మరమ్మత్తులు చేయాలని సూచించారు. డ్యూ లిస్ట్ రిజిస్టర్లు, వ్యాక్సిన్ క్యారియర్, వ్యాక్సిన్ లాజిస్టిక్స్, ఇతర రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు సలహాలు అందజేశారు. అనంతరం భద్రాచలం యాంటీ యాస్ యూనిట్, యాంటీ మలేరియా యూనిట్‌ను సంధర్శించి బదీలిపై వచ్చిన సూపర్




వైజర్లుకు, విధుల నిర్వాహణపై మార్గనిర్దేశం చేశారు. మలేరియా స్టోర్ రూమ్‌ను పరిశీలించారు.సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు సన్నాహక చర్యల్లో భాగంగా ఫాగింగ్ యంత్రాలను మరమ్మత్తులు చేయించి సిద్దంగా ఉంచాలని ఆదేశించారు.

# ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వ ఐటిఐ లోని ప్రవేశాల కోసం మొదటి విడత ప్రవేశాల గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటిఐ కృష్ణ సాగర్, మణుగూరు ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటిఐ, ఏటీసీలలో మొదటి విడత ప్రవేశాల కోసం ఈ నెల 8 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. ఈ దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పినపాక నియోజకవర్గ పరిధిలోని కృష్ణసాగర్, మణుగూరు ప్రభుత్వ ఐటిఐ ఏటీసీలలో ఉన్న కోర్సులకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కృష్ణ సాగర్ ఐటిఐ లోని ఎలక్ట్రీషన్ కోర్స్ కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. మణుగూరు ప్రభుత్వ ఐటిఐ లో ఎలక్ట్రీషన్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సుల్లో ప్రవేశాలు కోరుతున్నట్లు తెలిపారు. కృష్ణ సాగర్, మణుగూరు ఏటీసీలలో సి ఏన్ సి, ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్, మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్, మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెసింగ్ కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ డిజిటల్ మ్యాను ఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, వర్చువల్ ఎనాలసిస్ డిజైనర్ అండ్ ఫినేట్ ఎలిమెంట్ మెథడ్ కోర్సులలో ప్రదేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు ఈనెల 30 లోగా ఆన్లైన్లో తమ దరఖాస్తులను అందజేయవలెనని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఆన్లైన్ దరఖాస్తుల కోసం నేరుగా ప్రభుత్వ ఐటిఐ కృష్ణసాగర్, మణుగూరుల లో సంప్రదించాలన్నారు. కృష్ణసాగర్ ఐటిఐ కోసం 6305949086, 9866463716,లకు, మణుగూరు ఐటిఐ కోసం 9848853255, 9492959511లకు ఫోన్ చేసి తెలుసుకోవాలన్నారు.

# కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

**- పరిసరాల్లో ఉత్కంఠ, ఉద్రిక్తం**
**- వేలాది మందితో భారీ ప్రదర్శన, నేలపై పడుకొని నిరసన**
**కేంద్రం తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాకతప్పదు**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**






**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పెంచిన ఇంధన ధరలు తగ్గించాలని, నిత్యవసరాలను పేదలకు అందుబాటులోనికి తేవాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన నిరసన ధర్నా తీవ్ర ఉత్కంఠ, ఉద్రిక్తంగా మారింది. జిల్లా నలు మూలల నుండి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. కలెక్టరేట్ ప్రధాన రహదారిపై భారీ ప్రదర్శన నిర్వహించిన అనంతరం ప్రధాన ద్వారం ముందు మండు టెండలో నేలపై పడుకుని తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. శాంతియుతంగా సాగుతున్న ధర్నాను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో నాయకులు, పోలీసుల నడుమ తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో కలెక్టరేట్ ప్రాంగణం ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ ధరలు తగ్గుతున్నప్పటికీ దేశంలో మాత్రం ఇంధన ధరలను పెంచుతూ సామాన్యుని నడ్డి విరిస్తున్నారని విమర్శించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి రేషన్ షాపుల ద్వారా అన్ని రకాల నిత్యవసర సరుకులను సబ్సిడీపై పేదలకు అందించకుండా చేస్తున్నారని మండిపడ్డారు. విచ్చల విడిగా సాగుతున్న బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని పాషా ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీరుమార్చుకోకుంటే ప్రజాగ్రహానికి గురుకాక తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు, మేయర్ మూడ్ గణేష్, జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, సలిగంటి శ్రీనివాస్, సరెడ్డి పుల్లారెడ్డి, కే సారయ్య, మున్నా లక్ష్మి కుమారి, చంద్ర నరేంద్ర కుమార్, వి పూర్ణ చంద్రరావు, జి వీరస్వామి, కంచర్ల జమలయ్య, కందుల భాస్కర్, రేసు ఎల్లయ్య, మువ్వా వెంకటేశ్వరరావు, భూక్యా ధస్రు, ఉప్పుశెట్టి రాహుల్, ఎస్‌కే ఫహీమ్, మండల కార్యదర్శులు,జిల్లా సమితి సభ్యులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గన్నారు.

# ఏజెన్సీ ప్రాంత వైద్యంపై పాలకులకు చిన్నచూపు

**- భద్రాచలం ఏరియా ఆస్పత్రిని ముఖ్యమంత్రి సందర్శించాలి**
**- సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**




**ప్రజాపక్షం/భద్రాచలం :** ఏజెన్సీ వైద్యంపై పాలకులు సవతితల్లి ప్రేమను చూపుతున్నారని, ఇక్కడి పరిస్థితిలు అత్యంత దయనీయంగా ఉన్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఆస్పత్రిని సందర్శించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ రాష్ట్ర, జిల్లా, పట్టణ బృందం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించింది. ఈ సందర్భంగా వెస్లీ పలువురు రోగులతో స్వయంగా మాట్లాడి వారికి అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై వైద్యులను అడిగి తెలుసుకుని చర్చించారు. ఆ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఏజెన్సీ వైద్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న ఈ ఆస్పత్రికి ప్రతిరోజూ 400 నుండి 600 మంది రోగులు వస్తుంటారని, వారందరికీ వైద్యం అందించేందుకు కేవలం 19 మంది వైద్యులు మాత్రమే ఉండటం శోచనీయం అన్నారు. ఇక నర్సింగ్ సిబ్బంది 55 మందికి గానూ 15 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. సగానిపైగా ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయాల్సిన పాలకులు నిర్లక్ష్యం వహించడం సరికాదని ఆరోపించారు. అత్యాధునిక వైద్య పరికరాలు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేక పేదవాడికి ప్రభుత్వం వైద్యం అందని ద్రాక్షాగా మారిందని, ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి పారిశుద్య పనులు నిర్వహించే సిబ్బందికి చాలీచాలని వేతనాలు ఇస్తూ వాటిని కూడా సకాలంలో అందించడం లేదన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఉండగా కేవలం రూ.11 వేలు మాత్రమే ఇవ్వడమేమిటని ప్రశ్నించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు కూడా ఇక్కడ అందుబాటులో లేవని, జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ఏరియా ఆస్పత్రిని సందర్శించిన పాపాన పోలేదని విమర్శించారు. సిపిఐ ఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యంపై రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేస్తున్నామని, నెలకొన్న సమస్యలపై ఆగస్టులో హైదారాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ప్రత్యేకించి భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నెలకొన్న దుస్తితిపై తమ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళుతుందని తెలిపారు. నెలకొన్ని అన్నిరకాల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్‌లో తీవ్ర ఉద్యమాలు ఎదుర్కొక తప్పదని జాన్ వెస్లీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సున్నం గంగ, పట్టణ నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ని ఇబ్బందులు తలెత్తినా పేదోడి కల నెరవేరుస్తాం

**ఎమ్మెల్యే రాందాస్‌నాయక్**



**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం ఏర్పడిన తర్వాత పేదవాడి కళ నెరవేర్చే విధంగా సంక్షేమ పథకాలను ఎన్ని ఆర్థిక ఇబ్బందులు తలెత్తిన ఈ రాష్ట్రాన్ని గత పాలకులు నిర్వీర్యం చేసి అప్పులు పాలు చేసిన దానిని అదిగమించుకుంటూ ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తూ రైతన్న కాపాడుకుంటూ ఈ రోజు పరిపాలనను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సారథ్యంలో ఈ రోజు రాష్ట్రంలో సస్యశ్యామలంగా పరిపాలన నడుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పక్కా గృహాలు నిర్మాణం జరగాలని, రూ.5లక్షలు పూర్తి సబ్సిడీతో పేద ప్రజలకు అందించడం జరిగింది. అదేవిధంగా వైరా మున్సిపాలిటీ గురించి మాట్లాడుకుంటే గత పాలకులు పరిపాలన చేయలేక డబ్బులను దోచుకొని ఎక్కడ పనులు అక్కడ అర్ధాంతరంగా వదిలిపోతే వాటన్నింటిని సరిదిద్ద వీలు లేకుండా నిర్వీర్యం చేసి పోయారు. అయినా సరే వాటన్నింటికి మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రీటెండర్లు పిలిచి వాటన్నింటిని సుందరీకరణ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. కాంగ్రేస్ పార్టీకి విధేయురాలిగా కాంగ్రేస్ పార్టీతోనే ప్రజా సంక్షేమ పథకాలు రాజ్యాంగ పరిరక్షణ విలువలతో కూడిన రాజకీయాలు కాంగ్రేస్ పార్టీతోనే సాధ్యమైందని గొప్పగా నమ్మిన వ్యక్తి మీనాక్షి నటరాజన్ ఆమె నామినేషన్‌ను ఈ రోజు ఎలక్షన్ కమీషన్ అడ్డం పెట్టుకొని తిరస్కరించడం ఇది ప్రజాస్వామ్య విరుద్ధం. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రేస్ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మార్కెట్ కమిటీ బోళ్ళ గంగారావు, డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, జిల్లా అధికార ప్రతినిధి పమ్మి అశోక్, పాలేటి నర్సింహారావు, వీరంశెట్టి సీతారాములు, జవ్వాజి నాగరాజు, పెద్దప్రోలు లక్ష్మ య్య, గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధజలోని లాలాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను బుధవారం వైరా మున్సిపల్ కమీషనర్ ఎం.రామచంద్రరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కళ్యాణ్, పలువురు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

## పెనంపల్లిలో రూ.80లక్షల రుణాల పంపిణీ

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పరిధిలోని రైతులకు రూ.80లక్షలు రుణాలు పంపిణీ చేసినట్లు చైర్మన్ నాగుబండి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 15మంది రైతులకు రూ.60లక్షలు, గృమ నిర్మాణం కోసం మరో రూ.20లక్షలు రుణాలు అందించినట్లు తెలిపారు. వాణిజ్య బ్యాంకులకు ధీటుగా రుణాలు అందిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి మేనేజర్ ఇందు, సూపర్‌వైజర్ నాగప్రసాద్, పాలక సభ్యులు భాస్కర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, విజయభాస్కర్, రైతుమిత్రులు తాళ్లూరి సత్యం, సామేల్, యాదగిరి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలో మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన మైనర్‌బాలికపై లైంగికదాడికి పాల్పడి భవనం పై నుంచి కిందికి పడేసి హత్యకు యత్నించిన సంఘటనలో నిందితుడు కారు డ్రైవర్ ఎండి గౌస్ ను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాపర్తి నగర్‌లోని జిప్రైడ్ అపార్టుమెంట్‌లో ఉంటున్న కారుడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా మైనర్‌పై లైంగికదాడికి పాల్పడ్డు అంగీకరించడని టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి మీడియాకు తెలిపారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గౌస్‌పై ఫోక్స్, హత్యయత్నం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితురాలి వాగ్మూలం నమోదుచేసి వైద్యపరీక్షలు నిర్వహించి వైద్యుల రిపోర్టు ఇతర ఆధారాల ఆధారంగా నిందితుడిని స్థానిక కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు పేర్కొన్నారు. విషయం బయటపడిన ఇరవైనాలుగు గంటలలోపు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. కేసు విచారణలో ఉన్నందున బాధితురాలి ఫోటో, పేరు తదితరాలు ఎవరైనా సోషల్‌మీడియాలో ప్రచారం చేస్తే వారిపై ఫోక్స్, బిఎస్‌ఎస్ యాక్టుల కింద వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## హెడ్‌కానిస్టేబుళ్లను అభినందించిన సిపి



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** వివిధ పోలీస్ స్టేషన్‌లలో కానిస్టేబుళ్లుగా విధులు నిర్వహిస్తూ హెడ్‌కానిస్టేబుళ్లుగా ఉద్యోగోన్నతి పొందిన రెండు వేల బ్యాచ్‌కు చెందిన ఎనిమిది మందిని పోలీసు కమిషనర్ సునిల్ దత్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా వారికి పదోన్నతి చిహ్నాలను అలంకరించారు. పదోన్నతిపై ఇతర జిల్లాలకు బదిలిపై వెళ్తున్న చోట విధి నర్వహణలో భాగంగా శాంతి భద్రతల పరిరక్షణలో తమదైన గుర్తింపుతోచుకోవాలని ఆకాంక్షించారు. వీరిలో ఖమ్మం జిల్లాకు ఇద్దరు, మహబూబాబాద్ జిల్లాకు ఒకరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు నలుగురు, ఇంటిలిజెన్స్‌కు ఒకరు బదిలిపై వెళ్లనున్నట్లు సిపి తెలిపారు.

## గంజాయి రహిత సమాజ స్థాపనే లక్ష్యం

**- అడిషనల్ డిసిపి రామానుజం**



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** గంజాయి రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా అందరూ కృషిచేయాలని అడిషనల్ డిసిపి అడ్మిన్ భోజా రామానుజం అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గంజాయికి బానిసైన వారి కోసం ఏర్పాటు చేసిన డీఅడిషన్ సెంటర్‌ను ఆయన సందర్శించారు. తొలుత ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రామానుజం మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థల వినియోగం వలన కలిగే నష్టాలపై జిల్లా వ్యాప్తాంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గంజాయి వినియోగించినా, రవాణాకు పాల్పడిన శిక్షలు తీవ్రంగా ఉంటాయన్నారు. అన్ని వర్గాల ప్రజలు మత్తుపదార్థల వాడకం వలన సమాజానికి కలిగే నష్టాలను గుర్తించి వాటిని పూర్తిస్థాయిలో నిర్మూంలించేందుకు కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థల వాడకం వలన కలిగే అనార్థాలు, దుష్ప్రబావాలను అక్కడి వైద్యులు అవగాహన కల్పించారు. గంజాయి, డ్రగ్స్ వినియోగం, రవాణాపై పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞాప్తి చేశారు. ఈసందర్భంగా గంజాయి నిర్మూలిస్తామంటూ ప్రతిజ్ఞా చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం టౌన్ ఏసిపి ఎస్‌వి రమణమూర్తి, వన్‌టౌన్, టూటౌన్ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, బాలకృష్ణ, ఆస్పత్రి సూపరిండెంట్ పాల్గొన్నారు.